# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక పురోగతిలో సి.ఐ.ఐ కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆరోగ్య వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
- ❖ ప్రాచీన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.
- ❖ ప్రపంచ స్థాయి మైస్ ఈవెంట్లకు ఆంధ్రప్రదేశ్ ను కేంద్రంగా మార్చేందుకు ప్రత్యేక విధివిధానాలను రూపొందిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

======================

భారత ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక పురోగతిలో భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) కీలక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న సి.ఐ.ఐ. వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొని ప్రసంగిస్తూ... దేశంలో స్థిర ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ఇన్వేస్టర్లు, పారిశ్రామికవేత్తలు దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, వర్సిటీలు కలసి పని చేస్తే భారత్ గ్లోబల్ లీడర్ గా ఎదుగుతుందన్నారు. 2047 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ అగ్రగామిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు చేస్తున్న సేవలు ఎనలేనివని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు గ్రామంలో ఆధునికరించిన పోలీస్ స్టేషన్ ను ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రతో కలసి

హోం మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ... రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లను ఆధునికీకరించడానికి, పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం 2026 బడ్జెట్లో అధికంగా నిధులు కేటాయించిందని తెలిపారు. దానిలో భాగంగానే కంకిపాడు గ్రామంలో 2 కోట్ల 75 లక్షల రూపాయలతో పోలీస్ స్టేషన్ ను ప్రారంభించామని తెలిపారు. ప్రజలకు సత్వర సేవలను అందించడానికి పోలీసు శాఖ సంసిద్ధంగా ఉందని, మహిళల భద్రత కోసం ఉమెన్ పోలీస్ స్టేషన్లు అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలో ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి ఆపద కలగకుండా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని మంత్రి అనిత తెలియజేశారు.

======================

సింగపూర్ పర్యటనలో భాగంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సింగపూర్ లోని సన్ టెక్ సిటీని సందర్శించారు. అక్కడ డీపీ అర్బన్ ఆర్కిటెక్ట్ సంస్థ డైరెక్టర్ ఆనందన్ కరుణాకరన్ తో లోకేశ్ ఈ రోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రపంచ స్థాయి మైస్ (MICE - Meetings, Incentives, Conferences, and Exhibitions) ఈవెంట్లకు కేంద్రంగా మారడమే ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని పేర్కొన్నారు. దీనికోసం తాము కొత్త మైస్ విధానాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ఈవెంట్ నిర్వాహకులకు సింగిల్ విండో అనుమతులను వేగవంతం చేయడానికి విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలలో ప్రత్యేక బ్యూరోలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు.

విరామం

======================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆరోగ్య వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువస్తుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం లక్ష్మీపురం గ్రామంలో 47 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మెడికల్ వ్యర్థాల భవన సముదాయాన్ని, మౌలిక సదుపాయాలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం బడ్జెట్లో అధిక నిధులను కేటాయించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పారదర్శకమైన సేవలను అందించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ హెల్త్ మిషన్ పథకం ద్వారా అధిక భాగం నిధులను గ్రామీణ ప్రాంతాలలో రోగులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడానికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో విలేజ్ హెల్త్ క్లినికలలో వైద్యుల నియామకం రొటేషన్ పద్ధతిలో నర్సులను 24 గంటలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ఆయుష్ వైద్య సేవల్లో నాణ్యత పెంచి.. మరింత విస్తృత పరచడంతో పాటు, నకిలీ వైద్యాన్ని నియంత్రించేందుకు మార్పులు తీసుకురానున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. సంప్రదాయ ఆయుర్వేదం, హోమియో, సిద్ధ, యూనాని, నేచురోపతి (ఆయుష్) వైద్యానికి మరింత ప్రాచుర్యాన్ని తెచ్చేందుకు, ప్రజలకు చేరువ చేసేందుకు వీలుగా నియంత్రణ వ్యవస్థను పటిష్టం చేయనున్నట్లు వెల్లడించింది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం-2022కు సవరణలు చేపట్టినట్లు ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. త్వరలో రానున్న కొత్త విధివిధానాల రూపకల్పనకు మూడు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ కమిటీలు ఆయుష్ వైద్య రంగ నిపుణులు, ప్రజలను భాగస్వామ్యం చేసి వారి సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

======================

జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, ఇన్నోవేటర్లు, యువతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. పోఖ్రాన్ విజయంతో భారతదేశ సాంకేతిక సామర్థ్యం ప్రపంచానికి చాటిందని తెలిపారు. జ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణల ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

=======================

=======================